# "ఏడు వారాల నగల్దిగేసిండు"

నా సోపతికాడు రామేశంను కలుద్దామని వాల్లింటికి పెయిన. మేమిద్దరం బావబామ్మర్దుల వరుసతోని పిల్సుకుంటం. అందుకోసం అల్లవ్వను నేను అత్తని పిలుత్త. నేనాల్లింటికి పొయ్యేవారకు రామేశం నాయిన్న వెంటకయ్య మామ వాకిట్ల నిల్చున్న నులకమంచంల కాల్లు కిందికి సాపుకొని కూసున్నడు. మోతుకాకుతోని చుట్ట జేసుకొని అండ్ల పొగాకు నింపుతండు. రాజమ్మత్తేమొ మామ క్కొంచెం దూరంల పిడుకల్జేత్తంది. పెండల ఉనుక గలిపి టప్‌టప్‌మని భూమ్మీదగొట్టి గుండ్రంగజేసి దూరం పడేత్తంది. తన పని తన్జేసుకుంటనే నేం బొయ్యేవారకంటంది.

"నల్ల పూసలను గుండ్లన్న లేపాయె. చేయించలేవు"

"గివ్వు దేడెల్లుతయి తియ్యలేవె?" అంటండు వెంకటయ్య మామ.

"కొడుకింట్ల లేడానె మామ?" అని దగ్గెరికి పొయ్యి నిల్సున్న.

"చాలా సేపాయె ఊళ్ళెకు వొయ్యి. మా అత్తడట్ల గూసో......." అన్నడు మామ.

నేను మంచంల కూసున్న. ఎంకటయ్యా మామింట్లకు వొయ్యి సుట్ట మీనగ్గ వెట్టుకొని తాక్కుంటచ్చి అరుగుమీద కూసున్నడు.

రాజమ్మత్త పిడుకల్జేసుకుంటనే మల్లోసారంది. "ఎన్నేండ్లాయె. వర్తి నల్లపూసలు మెడలేసుకోవట్టి. గీ ఎంటికలన్ని తెల్ల వడవట్టె. గుండ్లయితె సేపిత్త లేపోతివి. నా ఒర్రుడు నాదేకని నీకయితె సీమ గుట్టినట్టన్న ఐతలేపాయె"

వెంకటయ్య మామ సుట్టదాక్కుంట నవ్వింతు.

"ముసల్తనానికి నీకు నగలు గావన్నానోయ్"

"పెయ్యిమీద రొండు తులాలన్న లేపోతెట్ల? సచ్చినంక ఆడిపోరగాండ్లేడ్సుటానికన్న ఇంతంత బంగారముండన్నా? అద్దా?"

"బంగారముంటేనే ఏడ్తారె అల్లు? అయితె ఏడువకపోనియ్యి పటు. అల్లది నాది అంత గలిపి నేనే ఏడ్త అయినా గని నీమీద నగలు తక్కో ఉన్నయా?" అన్నడు మామ.

ఆ మాటలిని సిర్రుమనిటు దిరిగిందత్త.

"ఏడ పాడయినయి? నా మీద నగలున్నయట. అనుటానికి నోరెట్లత్తంది నీకు? నా

సెయ్యంత గొప్పనా తులమన్నెల్లులదా?" అని నా మొకాన జూసుకుంట "సూడు బిడ్డ నా మీన్న ఏడు వారాల నగల్దిగేసిండట మీ మామ. నగలున్నయంటండు నగలు" అని మూతి ముడ్సుకుంది.

"నేను రాజునయితె, నువ్వు రాణివయితె నీకు ఏడువారాల నగలేందే ముప్పై రోజుల నగల్దిగేసెటోన్ని. కని నేనేమో ఎద్దుముడ్డి పొడ్సుకుంట బతికెటోన్నయితి. నువ్వేమొ ఎద్దోలె ఎనుకెనుకకు నడిసి నాటేసుకుంట బతికెదానివయితివి. ఇగ మనకేడువారాల నగలేన్నుంచొత్తయి సెప్పు. మల్ల జనుమల నువ్వే దేశానికన్న **రానివయి** పుట్టు. నేను రాజునయి పుడుత. గప్పుడు నీకు కిందినుంచి మీదిదాక నగల్దిగేత్త".

అత్త ముసిముసిగ నవ్వింది.

"అయినా నాకు తెలవకడుగుత. ఇప్పుడు నీకేం తక్కో ఉన్నయో సెప్పు?" అన్నడు మామ నవ్వుకుంట.

నేను పోతననుకున్నోన్ని ఆల్ల మాటలినుకుంట నా అండ్ల నేను నవ్వుకుంట కూసున్న.

"మల్ల గవ్వే మాటలంటవు. నలుపయేండ్లాయెనా మనం సంసారం జెయ్యవట్టి. ఒక్క తులం బంగారమన్న కొన్నవా చెప్పు?" అని నిలదీసడిగిందత్త.

ఆమె ముక్కుకు బులాకీ అటీటూగింది.

"అగో! నగలే లెవ్వంటవు. గా ముక్కు పొంటూగే బులాకేడిదే? అంటె నీకు ముక్కునిండ నగలున్నట్టే గద!" అన్నడు ఎంకటయ్యమామ నవ్వుకుంట.

"పాపం నువ్వే సేయించినవు గదా దీన్ని! గిది మా అవ్వ నా లగ్గంల పెట్టిందేనాయె. గిదీన్ని సిదగ్గొడితె వీసమెత్తన్న బంగారమెల్తదా? మాటల్నేర్సినవ్ మాటలు" అందత్త రుసరుసలాడుకుంట.

"నీకు తెలువదా నేనెంతెర్కోన్నో? నిన్ను సేసుకున్నంకనే మాటల్నేర్సుకుంటి. సరెగని నీ కాళ్ళకున్న సవ్వాశేరెత్తు[36] కడాలు నేం జేయించినయి గావా?"

"గివ్వి నువ్వే సేయించినవు. గివ్వెట్ల పాడయినయో సూడు. ఇవి సొక్కపెండియన్న గాకపాయె. తీపెండి పెంకలోలె ఎట్ల నల్లవడ్డయో సూడు. నగలు సేయించిన్నని మురుత్తండు పిల్లగాడు" అంది పిడకలు గట్టిగ బూమికేసు సరుసుకుంట రాజమ్మత్త.

ఆల్ల మాటలింటుంటె నాకు గమ్మత్తనిపిత్తంది. అక్కన్నే కదులకుంట కూసున్న.

"నడుము కొడ్డాలముండె. సేతులక్కడాలుండె. నాకేమొ మొలపట్టుండె. ఇంక మనకు

నగలెందుకే?" అని నవ్విండు మామ.

"గీ లేకిడెండి వగల గురించి మల్ల గిట్ల నోరుదెరిసేవు? గివ్వన్ని తీపెండియేనాయె. ఇవ్వమ్ముతె దుబ్బత్తదా? బురుదల, మంట్లె, మసానంల పన్జేత్తె నల్లవడి పెంకలోలయినయి. నగల్బిగేసిన్నని మురుత్తండింక" అని కారెడ్డంగ మాట్లాడింది రాజమ్మత్త.

"చెవ్వులకు గంటీలున్నయా లెవ్వా? మోసేతులకెండి కడెముందా లేదా? ఇగ నీకెక్కడ సందుందో సెప్పు?" ఇంకింత ఉడికియ్యన్నని అని అన్నడు మామ.

"నీ మాటలు పాడుగానూకో. ఎంత దిట్టినా మానం లేదు. గీ గంటీలు రొండు మాట్ల కరిగిచ్చి సేపిచ్చినయేనాయె! గిండ్ల పావులెత్తన్నెల్లుత్తదా? ఇగ నాకు పెట్టుకోను సందే లేదట! పిల్లగాడు నగలు జేయిత్తనంటండు గని పెట్టుకోను సందు లేదనూకుంటండు. ఏం లేకున్నా మాటలైతే నేర్సినావు!" అని కోపంగ లేచి సేసిన పిడుకలను గోడకు సరుత్తంది రాజమ్మత్త. ఆమె కోపానికి రాంగనే మామ తగ్గిండు.

"మనం మన పిల్లగాండ్ల జూసి సంబురపడాలెగని గిప్పుడు నగలెందుకు సెప్పు? ఉన్న దాంతోని తురితిపడుడు[37] నేర్సుకోవాలె!" అన్నడు మెల్లెగ.

నేన్నడుమ కలిపించుకొని

"కొడుకులం జేయించుమనక పెయినవా అత్త" అన్న

"ఇగ గాన్నడుగన్నా నోరిడిసి" కొడుకులకు లగ్గమయినంక పెండ్లాలె కనవడ్తరు గని అవ్వయ్యలు కనవడ్తరా బిడ్డ! ఆనికి నౌకరయిన కాడికెల్లి అన్ని పెండ్లానికే దిగేత్తండు. అయితె మానాయెపటు. అల్లు సుకంగుంటె గంతే సాలు. ఆనికంటెక్కో నాకెవ్వలున్నరు? అట్ల నోరాగకంటిగని గిప్పున్నాకు నగలెందుకు తియ్యి? నా కొడుకతోని గిట్టనేవు బిడ్డ? ఆడు బాద పడ్తడు. అయినా గని నౌకరి సేసెటోల్ల దగ్గెర పైసలుంటాయి! అట్ల తెల్లబట్టలుంటయి గని" అని తన పనిల లీనమై పోయిందత్త.

వెంకటయ్య మామ నవ్వుకుంటున్నడు.

ఆ నవ్వుల నాకు చార్లీచాప్లిన్ సినిమాల్లోని విచారం గనవడ్డది.

నేను లేసి నిల్సుని రాజేశమచ్చెటట్టు లేదని పోతన్నమామ అని చెప్పి బయటవడ్డ.

★★★